04-06-2025
బుధవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 247 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

# భూభారతి దేశ చరిత్రలో అరుదైన చట్టం



- అర్హులైన హక్కుదారులందరికీ భూ పట్టాలు ఇచ్చి వారి భూమిలో కూర్చోబెడతామని హామీ ఇస్తున్నాం. భూమిలేని పేదలకు సాగుభూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చే ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోని అసైన్డ్ కమిటీలను భూభారతి చట్టంతో తిరిగి ప్రారంభిస్తున్నాం.

**జయభేరి, ఖమ్మం, జూన్ 3:**

దేశ చరిత్రలో అరుదైన చట్టం భూభారతిఅని, రైతుల భూములు సర్వే చేయించి సరిహద్దులు గుర్తించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయడమే ఈ చట్టం లక్ష్యమన్నారు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క టిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి చట్టం రైతుల హక్కులను కాల రాసిందని, రైతును ఆగం చేసిందన్నారు. మధిర నియోజకవర్గం ములుగుమాడు గ్రామంలో భూభారతి సర్వే పైలట్ ప్రాజెక్టు ప్రారంభించిన తరువాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'టిఆర్ఎస్ నాయకులు వాళ్లకు కావాల్సిన వ్యక్తులకు భూములు కట్టబెట్టారు. తిరిగి సవరణ చేసే అవకాశం లేకుండా ధరణి చట్టాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చింది. పది ఎకరాల భూమి ఉంటే 17 ఎకరాలకు పాస్ బుక్కులు ఇచ్చారు. నేడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులకు ప్రయోజనం చేకూరేలా భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చి



# తొలి ట్రోఫీని ముద్దాడిన బెంగళూరు

## పంజాబ్‌పై ఘన విజయం.. 17 ఏళ్ల కోహ్లీ కల నెలవేరిన వేళ

- ఐపీఎల్ చరిత్రలో ఆర్‌సీబీ జట్టు ఎనిమిదో ఛాంపియన్‌గా నిలిచింది. దీనికి ముందు, చెన్నై సూపర్ కింగ్స్ (5 సార్లు), ముంబై ఇండియన్స్ (5 సార్లు), కోల్‌కతా నైట్ రైడర్స్ (3 సార్లు), రాజస్థాన్ రాయల్స్ (1), డెక్కన్ ఛార్జర్స్ (1), సన్‌రైజర్స్ హైదరాబాద్ (1), గుజరాత్ జెయింట్స్ (1) ఛాంపియన్లుగా నిలిచాయి.

ఎట్టకేలకు కోహ్లీ కల నెరవేరింది. 18 ఏళ్లుగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. ఐపీఎల్ 2025 ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఓడించి, తొలి ట్రోఫీని ముద్దాడింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL)లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) తొలి టైటిల్‌ను గెలుచుకుంది. మంగళవారం జరిగిన ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్ (PBKS)ను 6 పరుగుల తేడాతో ఓడించింది. దీనితో, IPL 18వ సీజన్‌లో 8వ ఛాంపియన్‌గా నిలిచింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో 191 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పీబీకేఎస్ 184 పరుగులు మాత్రమే చేయగలిగింది.

...మిగతాది 2 లో

# జగన్ రెడ్డీ.. ఖబడ్దార్


- సీఎం చంద్రబాబుపై నోరుజారితే తగిన గుణ పాఠం చెబుతామని హెచ్చరిక
- నైతికంగా పతనమైన నాయకుడు జగన్.
- రౌడీ షీటర్లకు పరామర్శతో అరాచకాలకు ప్రోత్సాహమిచ్చినట్లే.
- 5 ఏళ్ల అసమర్థ పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం
- దళితులను ఏనాడూ పట్టించుకోలేదు...
- ఉనికి కోసమే కుల, శవ రాజకీయాలు
- జగన్ పై మంత్రి సవిత విసుర్లు
- కూటమి ప్రభుత్వం అన్ని హామీలూ నెరవేస్తోంది...
- పథకాల అమలుపై చర్చకు సిద్ధమా : మంత్రి సవిత సవాల్



**జయభేరి, అమరావతి :**

నీతి, నిజాయితీకి నిలువెత్తురూపమైన సీఎం చంద్రబాబునాయుడు గురించి నోటికొచ్చిన మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతాం... ఖబడ్దార్ జగర్ రెడ్డి అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత హెచ్చరించారు. రౌడీ షీటర్లకు, గంజాయి గ్యాంగ్ కు పరామర్శ

...మిగతాది 2 లో



# లక్ష మంది టెక్ అప్రెంటీస్ ల శిక్షణ

## నాస్కామ్ ప్రతినిధులతో భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదన

**జయభేరి, అమరావతి, జూన్ 2 :**

దేశవ్యాప్తంగా ఐటీ పరిశ్రమ స్థితిగతులు, ఏపీలో టెక్ అవకాశాలపై నాస్కామ్ ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించారు. సోమవారం సచివాలయంలో నాస్కామ్ అధ్యక్షుడు రాజేష్ నంబియార్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ శ్రీనివాసన్ , నాస్కామ్ ఆర్ అండ్ డీ హెడ్ శివప్రసాద్ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఐటీ రంగంలో ఏపీని ముందుకు తీసుకువెళ్లేందుకు స్థానికంగా మౌలిక సదుపాయాల కల్పన, నైపుణ్యం

...మిగతాది 2 లో

# నైజీరియాలో జలవిలయం.. 700 మంది మృతి..!

**జయభేరి, న్యూ డిల్లీ జూన్ 3:**

ఆఫ్రికా దేశంను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఈ వర్షాల కారణంగా సంభవించిన వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. నైగర్ రాష్ట్రంలోని మోక్వా పట్టణంలో భారీ వరదలతో మరణించినవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. దాదాపు 700 వందల వరకూ ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా గురువారం ఉదయం అకస్మాత్తుగా కుండపోత వర్షం కురవడంతో దాదాపు ఐదు గంటల్లోనే భారీ వరద పట్టణాన్ని ముంచెత్తిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ వరదలకు ఇప్పటి వరకూ 200కి పైగా మృతదేహాలను గుర్తించారు. మరో 500 మంది ఆచూకీ గల్లంతైంది. వారంతా వరదల్లో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయి ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. గల్లంతైన వారిలో ఎవరూ సజీవంగా ఉండే అవకాశం లేనందున సహాయక చర్యలు నిలిపివేస్తున్నట్లు స్థానిక అధికారి మూసా కాంబోకు విలేకరులకు తెలిపారు.నైగర్ రాష్ట్రంలో వాణిజ్యపరంగా మోక్వా కీలక ప్రాంతం. ముఖ్యంగా రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాన్ని అకస్మాత్తుగా వరదలు ముంచెత్తడంతో ప్రాణ నష్టం అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

## తెలంగాణ ప్రతిష్ఠ పెంచిన అందాల పోటీలు

2 లో

# లక్ష దాటిన బంగారం



**జయభేరి, హైదరాబాద్, జూన్ 3:**

హైదరాబాద్ నగరంలో బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. సరికొత్త రికార్డులను నమోదు చేస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 10 గ్రాముల 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ.1,00,110 కి చేరింది. ఇది బంగారం ధరల చరిత్రలోనే అత్యధికమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గతంతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల అని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఈ ఏడాది ఏప్రిల్ 22వ తేదీన 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,00,015 వద్ద గరిష్ఠ స్థాయిని తాకింది. ఇప్పుడు ఆ రికార్డును కూడా అధిగమించి పసిడి ధర కొత్త శిఖరాలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు పెరగడం, డాలర్‌తో రూపాయి మారకం విలువలో చోటు చేసుకుంటున్న హెచ్చుతగ్గులు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, సరఫరా-డిమాండ్ మధ్య ఉన్న వ్యత్యాసం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న రాజకీయ అనిశ్చిత పరిస్థితులు వంటి అంశాలు బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది.ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కారణంగా బంగారం కొనుగోళ్లు పెరిగాయి. అంతేకాకుండా, చాలామంది బంగారాన్ని దీర్ఘకాలిక సురక్షితమైన పెట్టుబడిగా భావించడం కూడా అధిక కొనుగోళ్లకు కారణమైంది.

మొదటిపేజీ తరువాయి

## భూభారతి చరిత్రలో అరుదైన చట్టం

అమలు చేస్తున్నాం. ఎన్నికల ముందు చెప్పినట్టుగా ధరణి చట్టాన్ని బంగాళా ఖాతంలో కలిపాం. భూ సంస్కరణ ల చట్టంలో భాగంగా రాష్ట్రంలో 26 లక్షల ఎకరాల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచింది. దానిని బిఆర్ఎస్ ప్రభుత్వం ధరణి చట్టంలోని పార్ట్ బి లో పెట్టింది.. కానీ వాటిపై ఎలాంటి విచారణ చేయలేదు. తిరిగి ఆ అసైన్డ్ భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ జరిపి, అర్హులైన హక్కుదారులందరికీ భూ పట్టాలు ఇచ్చి వారి భూమిలో కూర్చోబెడతామని హామీ ఇస్తున్నాం. భూమిలేని పేదలకు సాగుభూమి, ఇళ్ల స్థలాలు ఇచ్చే ఎమ్మెల్యేల ఆధ్వర్యంలోని అసైన్డ్ కమిటీలను భూభారతి చట్టంతో తిరిగి ప్రారంభిస్తున్నాం. ఆబాది భూమిని సర్వే చేసే అవకాశం కొత్త చట్టం ద్వారా కల్పించాం. ప్రతి సంవత్సరం రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. ఎవరు భూములు అమ్మారు. భూ రికార్డుల్లో జరిగిన మార్పులను గ్రామ సభ ద్వారా వివరించడానికి భూభారతి చట్టం అవకాశం కల్పిస్తుంది.భూభారతి చట్టం రైతులు, రాష్ట్ర ప్రజలు సాధించిన విజయం. రైతులు భూమికి ఉన్న న్యాయబద్ధమైన హక్కులను కొలిచి వారికి తిరిగి అప్పగిస్తాం. పైలట్ ప్రాజెక్టు కింద సర్వే చేపడుతున్నాం అని చెబితే ములుగుమాడు ఊరంతా ఈ రెవెన్యూ సదస్సుకు కదిలి వచ్చింది. ఈ చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయనుందని చెప్పడానికి ఇది నిదర్శనం. భూభారతి చట్టం మన అందరిదీ. మీరు అవగాహన చేసుకోవాలి, మరో పది మందికి వివరించాలి' అని భట్టి విక్రమార్క సూచించారు.మనుషులకు ఆధార్ కార్డులు ఉన్నట్లే భూములకు సైతం భూధార్ కార్డులు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. గులాబీ ప్రభుత్వం ప్రజలను, రైతులను మోసం చేసి భూములు లాక్కుందని, ప్రజా ప్రభుత్వంలో బాధితులకు తిరిగి న్యాయం చేస్తామన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3500 మంది రెవెన్యూ అధికారులుగా నియమిస్తామని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం ద్వారా విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. ధరణి చట్టం వల్ల రైతులకు సమస్యలు వచ్చాయని, భూ భారతి చట్టంతో అన్నదాతల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు.

## తొలి ట్రోఫీని ముద్దాడిన బెంగళూరు

బెంగళూరు తరపున విరాట్ కోహ్లీ 35 బంతుల్లో 43 పరుగులు చేశాడు. జితేష్ వేగంగా బ్యాటింగ్ చేసి 240 స్ట్రైక్ రేట్ తో 10 బంతుల్లో 24 పరుగులు చేశాడు. కృనాల్ పాండ్యా 17 పరుగులకు 2 వికెట్లు పడగొట్టాడు. భువనేశ్వర్ కుమార్ కూడా 2 వికెట్లు పడగొట్టాడు. పంజాబ్ తరపున అర్షదీప్ సింగ్, కైల్ జామిసన్ 33 వికెట్లు పడగొట్టారు.
ఐపీఎల్ చరిత్రలో ఆర్‌సీబీ జట్టు ఎనిమిదో ఛాంపియన్‌గా నిలిచింది. దీనికి ముందు, చెన్నై సూపర్ కింగ్స్ (5 సార్లు), ముంబై ఇండియన్స్ (5 సార్లు), కోల్‌కతా నైట్ రైడర్స్ (3 సార్లు), రాజస్థాన్ రాయల్స్ (1 సారి), డెక్కన్ ఛార్జర్స్ (1 సారి), సన్‌రైజర్స్ హైదరాబాద్ (1 సారి), గుజరాత్ జెయింట్స్ (1 సారి) ఛాంపియన్లుగా నిలిచాయి.
**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ప్లేయింగ్ XI):** ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, మయాంక్ అగర్వాల్, రజత్ పాటిదార్(కెప్టెన్), లియామ్ లివింగ్‌స్టోన్, జితేష్ శర్మ(కీపర్), రొమారియో షెఫర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్, జోష్ హాజిల్‌వుడ్.
**పంజాబ్ కింగ్స్ (ప్లేయింగ్ XI):** ప్రియాంష్ ఆర్య, జోష్ ఇంగ్లిస్(కీపర్), శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), నెహాల్ వధేరా, శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా ఒమర్జాయ్, కైల్ జామీసన్, విజయ్‌కుమార్ వైషాక్, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్.
**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు:** రసిఖ్ సలామ్, మనోజ్ భాండాగే, టిమ్ సీఫెర్ట్, స్వప్నిల్ సింగ్, సుయాష్ శర్మ.
**పంజాబ్ కింగ్స్:** ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రవీణ్ దూబే, సూర్యాంశ్ షెడ్జ్, జేవియర్ బార్ట్‌లెట్, హర్‌ప్రీత్ బ్రార్.

## లక్ష మంది టెక్ అప్రెంటీస్ ల శిక్షణ

ఉన్న మానవ వనరుల్ని ప్రోత్సహించాల్సిన అంశాలపై సీఎం నాస్కామ్ ప్రతినిధులతో చర్చించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ, ప్రభుత్వ పాలనా వ్యవహారాల్లో సాంకేతికత జోడింపు వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. ఐటీ పరిశ్రమకు అవసరమైన టెక్ నిపుణుల్ని తయారు చేసేందుకు టెక్ అప్రెంటీస్ శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టాల్సిందిగా నాస్కామ్ ను సీఎం కోరారు. ఆంధ్రప్రదేశ్ లో లక్ష మంది టెక్ అప్రెంటిస్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించటం ద్వారా ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరులను అందించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు.

**విశాఖ, తిరుపతిలలో ఏఐ డిస్ట్రిక్ట్ టెస్ట్ బెడ్స్**

విశాఖ, తిరుపతిలో జిల్లా స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిస్ట్రిక్ట్ టెస్ట్ బెడ్ ఏర్పాటుకు నాస్కామ్ ప్రతిపాదన చేసింది. భూ సంబంధిత అంశాలు, వైద్యారోగ్యం, విద్యా రంగాల్లో ఓపెన్ ఏఐ ల్యాబ్ లు ఏర్పాటు చేసి పౌరసేవల్ని అందించొచ్చని వెల్లడించింది. బిల్డ్ ఇండియా ఇన్నోవేషన్ పైప్ లైన్ కార్యక్రమాన్ని బలోపేతం చేసేలా ఏపీలో గ్రామీణ టెక్ సొల్యూషన్స్ కు అవకాశం ఉందని నాస్కామ్ వివరించింది. వ్యవసాయం, వైద్యారోగ్యం, వాతావరణం ఇతర అంశాల్లో ఏఐ సాంకేతికతతో వందకు పైగా గ్రామీణ స్టార్టప్స్ ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు నాస్కామ్ ప్రతినిధులు సీఎంకు వివరించారు.

## జగన్ రెడ్డీ.. ఖబడ్దార్

చేసి నైతికంగా పతనమైన రాజకీయ నాయకుడివని మండిపడ్డారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు జగన్ రెడ్డి రాజ్యాంగం, చట్టం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలు సైతం జగన్ రెడ్డి మాటలను విని నవ్వుకుంటున్నారన్నారు. అయిదేళ్ల పాలనలో నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలంటూ అన్ని వర్గాలనూ జగన్ మోసం చేశారన్నారు. దళితులను అన్ని విధాలా అన్యాయం చేశారన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ను నిర్వీర్యం చేశారన్నారు. 201419లో అమలు చేసిన 27 పథకాలను, దళిత యువతకు స్వయం ఉపాధి పథకాలను నిలిపేశారని మండిపడ్డారు. జగన్ పాలనలో గతంలో ఎన్నడూ లేనంతగా దళితులపై దాడులు జరిగాయన్నారు. దళిత మహిళలపై అఘాయిత్యాలు సైతం చోటుచేసుకున్నాయన్నారు. ఇన్ని జరిగినా ఏనాడూ దళితులను పరామర్శించిన పాపాన జగన్ పోలేదన్నారు. మాస్క్ అడిగిన పాపానికి దళిత వైద్యుడు డాక్టర్ సుధాకర్ ను మానసికంగా హింసించి చంపారన్నారు. దళిత డ్రైవర్ ను డోర్ డెలవరీ చేసిన ఘనత కూడా వైసీపీ నాయకుడిదేనన్నారు. జగన్ కు కుల, శవ రాజకీయాలు చేయడం అలవాటైపోయిందని, అందుకే ఆయనను ప్రజలు పక్కనబెట్టారని అన్నారు. దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. జగన్ పరామర్శించిన వారి దాడిలో గాయపడిన కానిస్టేబుల్ కూడా దళితుడేనన్నారు. ఆయననెందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. అయిదేళ్లలో ఎంతమంది దళితులను జగన్ రెడ్డి పరామర్శించాడో చర్చించడానికి సిద్ధమా..? అని మంత్రి సవిత సవాల్ విసిరారు.

## పాక్ లో భూకంపం..

- తప్పించుకున్న 200లకు పైగా ఖైదీలు

**జయభేరి, న్యూ ఢిల్లీ, జూన్ 3:**

పాకిస్థాన్‌లోని బఛా జైలు పరిసర ప్రాంతంలో భూకంపం రావడంతో 200లకు పైగా ఖైదీలు తప్పించుకున్నారు. సోమవారం ఇక్కడ మూడుసార్లు భూమి కంపించింది. దీంతో జైలులోని కొన్ని గోడలకు పగుళ్లు రాగా.. కొన్ని కూలిపోయాయి. ఈ క్రమంలో 600 నుంచి వెయ్యి మంది ఖైదీలను బ్యారక్‌ల నుంచి వేరే ప్రాంతానికి అధికారులు తరలిస్తుండగా.. ఖైదీలు తప్పించుకున్నారు పలువురు అధికారుల వద్ద ఉన్న తుపాకులు తీసుకొని కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఒక ఖైదీ మృతి చెందగా.. నలుగురు అధికారులు గాయపడ్డారు.ఖైదీల పరారీతో అప్రమత్తమైన అధికారులు తిరిగి ఖైదీలను పట్టుకొనేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ 80 మందిని పట్టుకున్నామని.. అందుకు స్థానికుల సహాయం తీసుకున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ జైలులో ఎక్కువ శాతం మాదకద్రవ్యాల సంబంధిత కేసుల్లోని నేరస్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని మరో అధికారి తెలిపారు. పారిపోయిన వారిలో డ్రగ్స్ నేరస్థులు, మానసికంగా సరిగా లేని వారే అని ఎక్కువ ఉన్నారన్నారు.

# సైనికుల మనోధైర్యాన్ని దెబ్బతీసే రాజకీయాలు

**ఆపరేషన్ సిందూర్ భారతదేశం, అత్యాధునిక సైనిక సామర్థ్యాలను ఉపయోగించి, జైష్–ఎ–మహ్మద్ మరియు లష్కర్–ఎ–తొయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది.2025 ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది పౌరులు మరణించడం భారతదేశాన్ని కలిచివేసింది. ఈ దాడికి ప్రతీకారంగా, మే 7న భారత వైమానిక దళం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై కచ్చితమైన దాడులు చేపట్టింది.**




ఈ ఆపరేషన్ భారత సైనిక శక్తి, వ్యూహాత్మక సామర్థ్యాన్ని ప్రదర్శించినప్పటికీ, భారత ఫైటర్ జెట్స్ కూలిపోవడం రాజకీయ చర్చకు దారితీసింది. అయితే తాజాగా త్రివిధ దళాల అధిపతి దానిని ధృవీకరించాడు.ఆపరేషన్ సిందూర్ భారతదేశం, అత్యాధునిక సైనిక సామర్థ్యాలను ఉపయోగించి, జైష్-ఎ-మహ్మద్ మరియు లష్కర్-ఎ-తొయిబా వంటి ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. భారత వైమానిక దళం రాఫెల్, సుఖోయ్ Su30 MKI, మిరాజ్ 2000, మిగ్-29 విమానాలను, అలాగే బ్రహ్మోస్, స్కాల్ప్, రాంపేజ్ వంటి స్టాండ్-ఆఫ్ క్షిపణులను ఉపయోగించింది. ఈ దాడులు లైన్ ఆఫ్ కంట్రోల్ దాటకుండా, భారత గగనతలం నుండే నిర్వహించబడ్డాయి, ఇది భారతదేశం దీర్ఘ-శ్రేణి కచ్చితమైన దాడి సామర్థ్యాన్ని చాటింది. ఈ ఆపరేషన్‌లో 100కు పైగా ఉగ్రవాదులు నిర్మూలించబడ్డారని, పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన పలు స్థావరాలు ధ్వంసం చేయబడ్డాయని భారత అధికారులు పేర్కొన్నారు. ఆపరేషన్ సమయంలో భారత విమానాల క్షతాలు ఒక ప్రధాన వివాదాంశంగా మారాయి. పాకిస్తాన్ అధికారులు భారతదేశానికి చెందిన మూడు రాఫెల్, ఒక మిగ్-29, ఒక సుఖోయ్ Su30, ఒక డ్రోన్‌ను కూల్చినట్లు వాదించారు. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఆరు విమానాలు కూల్చినట్లు కూడా పేర్కొన్నారు, అయితే ఈ వాదనలకు ఆధారాలు అందించలేదు. భారత వైపు నుండి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్

> **ఎయిర్ మార్షల్ ఏకే. భారతి "నష్టాలు యుద్ధంలో భాగమే" అని పేర్కొన్నారు, కానీ ఖచ్చితమైన సంఖ్యలను ధ్రువీకరించలేదు. ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్ వైమానిక దళానికి గణనీయమైన నష్టం కలిగించింది.**

జనరల్ అనిల్ చౌహాన్ బ్లూమ్‌బెర్గ్ టీవీ ఇంటర్వ్యూలో కొన్ని విమాన క్షతాలను ఒప్పుకున్నారు, కానీ పాకిస్తాన్ వాదించిన ఆరు విమానాల సంఖ్యను ఖండించారు. "యుద్ధంలో నష్టాలు సహజం, కానీ మనం ఎన్ని కోల్పోయామనేది కాదు, ఎందుకు కోల్పోయామనేది ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు.అంతర్జాతీయ మీడియా నివేదికల ప్రకారం, భారతదేశం కనీసం మూడు విమానాలు (సంభావ్యంగా ఒక రాఫెల్, ఒక మిరాజ్ 2000తో సహా) కోల్పోయినట్లు సూచించాయి. అయితే ఈ క్షతాలు భారత గగనతలంలోనే జరిగాయని, పాకిస్తాన్ గగనతలంలో కాదని తెలిపాయి. ఈ విమానాలు పాకిస్తాన్ యొక్క చైనా-నిర్మిత J10C విమానాలు మరియు PL-15 క్షిపణుల ద్వారా కూల్చబడి ఉండవచ్చని, లేదా భారతదేశం యొక్క సొంత రక్షణ వ్యవస్థల ద్వారా తప్పుగా లక్ష్యంగా చేయబడి ఉండవచ్చని ఊహాగానాలు ఉన్నాయి.భారత విపక్ష పార్టీ కాంగ్రెస్ ఈ విమాన నష్టంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది, ముఖ్యంగా రాఫెల్ విమానాల క్షతాలపై స్పష్టత కోరింది. కాంగ్రెస్ నాయకులు ఈ ఆపరేషన్‌ను భారత వైమానిక దళం యొక్క లోపాలను బహిర్గతం చేసినట్లు విమర్శించారు, అలాగే ప్రభుత్వం సమాచారాన్ని దాచిపెడుతోందని ఆరోపించారు. అయితే, భారత ప్రభుత్వం, సైనిక అధికారులు ఈ క్షతాలపై వివరాలను వెల్లడించకుండా, ఆపరేషన్ యొక్క విజయాలపై దృష్టి సారించారు. ఎయిర్ మార్షల్ ఏకే. భారతి "నష్టాలు యుద్ధంలో భాగమే" అని పేర్కొన్నారు, కానీ ఖచ్చితమైన సంఖ్యలను ధ్రువీకరించలేదు.ఆపరేషన్ సిందూర్ పాకిస్తాన్ వైమానిక దళానికి గణనీయమైన నష్టం కలిగించింది. భారత దాడులు నూర్ ఖాన్, రఫీకీ, మురీద్, సర్గోధా, జాకోబాబాద్, భోలారీ వంటి పాకిస్తాన్ వైమానిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి, ఇందులో 20% పాకిస్తాన్ వైమానిక ఆస్తులు ధ్వంసం చేయబడ్డాయని నివేదికలు తెలిపాయి. పాకిస్తాన్ యొక్క ఒక F-16, JF-17, సాబ్ 2000 AWAC విమానాలు కూడా నాశనం చేయబడ్డాయని, ఇవి పాకిస్తాన్ రక్షణ సామర్థ్యానికి కీలకమైనవని తెలిసింది. ఈ నష్టాలు పాకిస్తాన్ వైమానిక దళాన్ని ఐదు సంవత్సరాల పాటు వెనక్కి నెట్టాయని, రాడార్ వ్యవస్థలు మరియు కమాండ్ సెంటర్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని విశ్లేషకులు అంచనా వేశారు.ఆపరేషన్ సిందూర్ భారత వైమానిక దళం యొక్క బలాన్ని చాటినప్పటికీ, కొన్ని సవాళ్లను కూడా బహిర్గతం చేసింది. పాకిస్తాన్ యొక్క చైనా-నిర్మిత J-10C విమానాలు, PL-15 క్షిపణులు భారత విమానాలను లక్ష్యంగా చేసుకున్నాయని, ఇది భారత గగనతల రక్షణ వ్యవస్థలలో లోపాలను సూచిస్తుంది. అదనంగా, భారతదేశం రూల్స్ ఆఫ్ ఎంగేజ్‌మెంట్ (RoE) కారణంగా భారత పైలట్లు మొదట దాడి చేయకపోవడం వల్ల పాకిస్తాన్ విమానాలు లాభం పొంది ఉండవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ ఆపరేషన్ భవిష్యత్ కోసం గగనతల రక్షణ సామర్థ్యాలను మెరుగుపరచడం, సమన్వయ వ్యవస్థలను బలోపేతం చేయడం, ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలను పెంచడం అవసరమని సూచిస్తుంది.ఆపరేషన్ సిందూర్ భారతదేశం యొక్క సైనిక సామర్థ్యాన్ని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దృఢమైన స్పందనను ప్రదర్శించింది. ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడం, పాకిస్తాన్ వైమానిక దళానికి గణనీయ నష్టం కలిగించడం ద్వారా ఈ ఆపరేషన్ వ్యూహాత్మక విజయాన్ని సాధించింది. అయితే, భారత ఫైటర్ జెట్స్ నష్టంపై ఉన్న అస్పష్టత, రాజకీయ చర్చ భారత వైమానిక దళం యొక్క సిద్ధత, సమన్వయంపై ప్రశ్నలను లేవనెత్తింది. ఈ ఆపరేషన్ భవిష్యత్ సైనిక చర్యలకు ఒక ముఖ్యమైన పాఠంగా నిలుస్తుంది, భారతదేశం యొక్క రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడానికి మార్గం సుగమం చేస్తుంది.

# తెలంగాణ ప్రతిష్ట పెంచిన అందాల పోటీలు




**జయభేరి, హైదరాబాద్, జూన్ 3:**

దాదాపు నెల రోజుల పాటు జరిగిన మిస్ వరల్డ్ పోటీలు ముగిసాయి. రకరకాల ఈవెంట్స్ లో భాగంగా ప్రభుత్వం చేసిన ఏర్పాట్లు తెలంగాణ ప్రతిష్టను పెంచాయి. బిగ్ ఫోర్ బ్యూటీ కాంటెస్ట్ లలో (మిస్ యూనివర్స్, మిస్ ఇంటర్నేషనల్, మిస్ ఎర్త్ , మిస్ వరల్డ్ )ఒకటైన మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో ఘనంగా ముగిశాయి. నెల రోజులపాటు ప్రపంచ సుందరీమణులంతా తెలంగాణలో సందడి చేశారు. ఈ పోటీలు కేవలం అందగత్తెల ఎంపిక మాత్రమే కాకుండా, తెలంగాణ సంస్కృతి, ప్రత్యేక ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిందీ అందాల పండుగ. వివిధ సంస్కృతుల నుంచి వచ్చిన సుందరీమణుల సామాజిక సేవా కోణం ప్రదర్శితమైంది. మిస్ వరల్డ్ పోటీలకు భారత్ మూడోసారి ఆతిథ్యం ఇచ్చింది. 1996లో ఇండియన్ సిలీకాన్ వ్యాలీగా పేరుపొందిన బెంగళూరు ఆతిథ్యం ఇవ్వగా, 2024లో మన దేశ ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబయి వేదికైంది. గతేడాదే మన దేశ ఆతిథ్యం రుచి చూసిన మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ మరోసారి ఇండియాలోనే ఈ పోటీలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈదఫా అందుకు సిటీ ఆఫ్ పెరల్స్ గా ప్రపంచంలో గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరాన్ని వేదికగా ఎంచుకుంది. మే 10, 2025న ప్రారంభమైన ఈ పోటీలు నెల రోజుల పాటు సాగాయి. ఈ అతి పెద్ద అందాల సుందరాంగుల పండుగలో 108 దేశాల అందగత్తెలు మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీ పడ్డారు.మిస్ వరల్డ్ 2025 వేడుకల్లో తెలంగాణ సంస్కృతిని పరిచయం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
నెల రోజులపాటు సాగిన అందాల పండుగలో ప్రపంచ సుందరీమణులు తెలంగాణ పర్యాటక స్థలాలు, చారిత్రాత్మక ప్రాంతాలను సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. చార్మినార్, రామప్ప దేవాలయం, నాగార్జున సాగర్ లోని బుద్ధ వనం, యాదాద్రి దేవాలయం వంటి ప్రాంతాలను సందర్శించారు. చారిత్రాత్మక కట్టడాలను చూసి వారు అబ్బురపడ్డారు. అంతే కాకుండా నవ తెలంగాణకు నిదర్శనమైన తెలంగాణ పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, నూతన సచివాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ వంటి పర్యాటక ప్రాంతాలను, నిర్మాణాలను చూసి అచ్చెరువొందారు. అంతే కాకుండా తెలంగాణ స్థానిక కళలను వీక్షించారు. సంప్రదాయ వంటకాలను రుచి చూశారు. స్థానిక నృత్యాలను అనుసరిస్తూ వారు చిందులేశారు. దాకేవలం ర్యాంపులపై హోయలొలికిస్తూ నడవటమే కాదు సామాజిక బాధ్యతలో తాము అంటూ నిర్వహించే బ్యూటీ విత్ ఏ పర్పస్ కాంటెస్ట్ ఈ అందాల పోటీల్లో హైలెట్ గా చెప్పవచ్చు. ఇందులో పోటీ పడ్డ అందగత్తెలందరూ సమాజానికి ఉపయోగపడే ప్రాజెక్టులను ఇక్కడ ప్రదర్శించారు. మన దేశం నుంచి పోటీ పడ్డ నందినీ గుప్తా ప్రాజెక్ట్ ఏక్తాను ప్రదర్శించారు. దివ్యాంగుల పట్ల అవగాహన, వారి పట్ల దయ,కరుణను పెంచే ప్రాజెక్టు ఇది. అయితే ఈ పోటీలో పైప్ లైన్ ఫర్ లైఫ్ లైన్ ప్రాజెక్టును ప్రదర్శించిన ఇండోనేషియా కాంటెస్ట్ మోనికా కెజియా సెంబరింగ్ , బ్యూటి విత్ ఏ పర్పస్ పోటీలో గెలుపొందారు. పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్య సదుపాయలను మెరుగుపర్చే ప్రాజెక్టు ఇది.మిస్ వరల్డ్ 2025లో మరో ప్రధాన ఆకర్షణ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన అందాల భామల స్పోర్ట్స్ ఛాలెంజ్ పోటీలు. ఈ ఛాలెంజ్ లో ప్రధానంగా మల్లఖంబ, యోగా, మార్షల్ ఆర్ట్స్, వంటి భారతీయ సంప్రదాయ పోటీలను నిర్వాహకులు నిర్వహించారు. వీటితోపాటు స్కేటింగ్, జిమ్నాస్టిక్, షాట్ పుట్, బ్యాట్మింటన్, ఫుట్ బాల్ షూటౌట్స్, స్ప్రింట్, జుంబా సెషన్ వంటివి నిర్వహించారు.
ఈ పోటీల్లో చిన్న పిల్లల్లా వీరంతా పాల్గొని కేరింతలు కొట్టారు. ఇందులో మిస్ ఎస్టోనియా ఎలిస్ రాండ్మా గోల్డ్ మెడల్ గెల్చుకున్నారుశిల్పకళా వేదికగా ప్రపంచ సుందరీమణులంతా వారి కున్న టాలెంట్స్ ను ప్రదర్శించే పోటీలో ఉత్సాహంగా పాల్గొనడం ఈ ఈవెంట్లో మరో ముఖ్య ఆకర్షణ. వీరంతా సంగీత వాయిద్యాలు వాయించడం, పాటలు పాడటం, వారి స్థానిక నృత్య రీతులను ప్రదర్శించడం వంటివి చేసి ఆకట్టుకున్నారు. అంతే కాకుండా కవిత్వం, ఉపన్యాస పోటీలు, ఏక పాత్రాభినయనం వంటి నైపుణ్యాలతో ఆకట్టుకున్నారు. చిన్న నాటికలు వేసి తమ నటనా సామర్థ్యాన్ని బయటపెట్టారు. ఇందులో మిస్ నైజిరీయ్ ఆడా ఓలువ్మి తన పాటలు, డాన్స్ లతో ఉర్రూతలూగించారు. ఇక తెలుగులో బాగా వైరల్ అయిన రాను ముంబయికి నే రాను అనే పాట పాడి, ఆఫ్రికన్ ఇండియన్ స్టైల్ లోఆ పాటకు డ్యాన్స్ చేసి వేసిన స్టెప్పులు సూపర్ డూపర్ గా ఆకట్టుకున్నాయివరల్డ్ 2025 ఫైనల్స్ పోటీల్లో మిస్ వరల్డ్ 2016 విజేత స్టెఫానీ డెల్వాలే, ఇండియన్ టీవీ ప్రజెంటర్ సచిన్ కుంభార్ తమ వాఖ్యానంతో అదరగొట్టారు. బాలీవుడ్ స్టార్స్ జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ చేసిన డ్యాన్సులు ఆహుతులను అలరించాయి. ఇషాన్ ఖట్టర్ ఆర్. ఆర్. ఆర్ సినిమాలోని నాటు నాటు సాంగ్ కు వేసిన స్టెప్పులు అక్కడికి ప్రపంచ సుందరీమణులు లేచి ఆడేలా చేశాయి.మిస్ వరల్డ్ జడ్జి ప్యానెల్ లో మన భారతీయులే ఎక్కువ మంది ఉండటం విశేషంగా చెప్పాలి. ఇందులో సినీ యాక్టర్ సోనూ సూద్, రానా, నమ్రత శిరోద్కర్, మాజీ మిస్ ఇంగ్లాండ్ డా. కరీనా టర్రెల్, మిస్ వరల్డ్ ఛైర్ పర్సన్ జూలియా మెర్లీ, మిస్ వరల్డ్ 2017 మానుషి చిల్లర్, ఐఎఎస్ అధికారి జయేశ్ రంజన్, వ్యాపారవేత్త సుధారెడ్డి ఉన్నారు. ఈ వేడుకల్లోనే సోనూ సూద్ ప్రముఖ మానవతావాదిగా ప్రత్యేక గౌరవాన్ని రానా చేతుల మీదుగా పొందారు.ఈ ఏడాది మిస్ వరల్డ్ క్రౌన్ అత్యంత విలువైంది. 1770 వజ్రాలతో 175.49 క్యారెట్ల మొత్తంలో, 18 క్యారెట్ వైట్ గోల్డ్ తో ఈ కిరీటం తయారు చేశారు. దీని విలువ మూడు కోట్లు. ప్రైజ్ మనీ 8.5 కోట్లు గా ప్రకటించారు. ఈ సంవత్సరం మిస్ వరల్డ్ క్రౌన్ అత్యంత విలువైనదిగా నిలిచింది.మిస్ వరల్డ్ 72 ఎడిషన్లలో గతంలో ఎన్నడూ లేనిది, తొలిసారి థాయ్‌లాండ్ ఈ కిరీటాన్ని దక్కించుకుంది. ఈ గ్రాండ్ ఫినాలేలో థాయ్‌లాండ్ అందగత్తె సుచాత చాయాంగ్రి శ్రీ విజేతగా నిలిచారు. ఫస్ట్ రన్నరప్ గా ఇథియోపియాకు చెందిన హాసెట్ డెరెజె ఫస్ట్ రన్నరప్ గా నిలిచారు. ఇలా ఇథియోపియా నుంచి పోటీ పడిన ఓ సుందరీమణికి ఫస్ట్ రన్నరప్ రావడం 72 ఎడిషన్లలో ఇదే తొలిసారి. ఈ మిస్ వరల్డ్ పోటీల్లో ఇదీ ఓ హైలెట్.

# ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలి

✍ జయభేరి, తుర్కపల్లి, జూన్ 3 :

ముఖ్యమంత్రి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం తిరుమలపూర్ గ్రామంలో జూన్ 6వ తేదీన నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి బహిరంగ సభ ఏర్పాటు పనులను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన కోసం జూన్ 6వ తేదీన ముఖ్యమంత్రి సుమారు 1500 కోట్లతో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాల్లో రాష్ట్రం బీఆర్ఎస్ ప్రభుత్వంలో పూర్తిగా వెనుకబడిందని, యాదగిరిగుట్ట అభివృద్ధి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ,పొన్నం ప్రభాకర్లు హాజరవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని సోనియా గాంధీ అప్పగిస్తే గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదాయం గల రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు. గంధ మల్ల 1.4 టీఎంసీల కోసం సుమారు 700 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణానికి, మండలంలో ఎస్సీ ఎస్టీలు అధికంగా ఉన్నారని అందుకోసం 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవరానికి, యాదగిరి గుట్టలో 25 కోట్లతో వేద పాఠశాల, కొత్తగా ఏర్పడిన మోటకొండూరు మండలంలో మూడు ప్రభుత్వ భవనాలకు 15 కోట్లతో, కొలనుపాక కాల్వపల్లి బ్రిడ్జిల నిర్మాణానికి 15 కోట్లతో, యాదగిరిగుట్ట ప్రాంతంలో 20 ఎకరాల్లో 170 కోట్లతో మెడికల్ కాలేజ్ ఏర్పాటుకు, 10 కోట్లతో గోదాముల నిర్మాణానికి సుమారు 1500 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య మంత్రి శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అయినాల చైతన్య మహేందర్రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్చిస్తి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈసారపు యాదగిరి ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ డొంకెన వెంకటేష్,, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రామగొని వెంకటేష్ గౌడ్, నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## అభిజీత్ ముహూర్తంలో రామ దర్బార్ పవిత్రీకరణ

✍ జయభేరి, లక్నో, జూన్ 3:

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిర నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇప్పుడు ఆలయంలో రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది. 2024 జనవరి 22న గర్భ గుడిలో బాల రామయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇప్పుడు రెండవ ప్రాణ ప్రతిష్ఠ వేడుక ఈ రోజు నుంచి ప్రారంభమైంది, ఇది జూన్ 5న రామ్ దర్బార్ లోని విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠతో పూర్తవుతుంది. గంగా దసరా కూడా జూన్ 5న జరుపుకోనున్నారు. అయితే రామ దర్బార్ ప్రాణ ప్రతిష్ఠ ఆలయంలో జరుగుతుంది. ఈ సమయంలో భక్తులు రామ దర్బార్ ను దర్శనం చేసుకోలేరు.రామ దర్బార్ ను చూసేందుకు ప్రణాళిక వేసుకుంటున్న భక్తులు ఈ నెల 5న భక్తులు అయోధ్యకు రావద్దని శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ విజ్ఞప్తి చేశారు. ఎందుకంటే వాతావరణం దృష్ట్యా రామ దర్బార్ ప్రతిష్ట సమయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఈ కార్యక్రమం కోసం ఎవరినీ ఆహ్వానించలేదని చెప్పారు. ఆయన సోషల్ మీడియా ద్వారా భక్తులను కోరారు.

అయితే.. భక్తులు యధావిధిగా బాల రామయ్యను దర్శనం చేసుకోవచ్చని ఆయన అన్నారు. అంతేకాని ప్రత్యేక ప్రణాళికతో మాత్రం భక్తులు అయోధ్యకు రావద్దని అభ్యర్థించారు. రామమందిరం మొదటి అంతస్తులో రామ దర్బార్‌తో పాటు.. ఆలయ ప్రాంగణంలో మిగిలిన 6 దేవాలయాలను కూడా ప్రతిష్ఠించనున్నారు. ఇవి గణేశుడు, శివుడు, భగవతి, హనుమంతుడు, సూర్యుడు, అన్నపూర్ణ దేవి సహా శ్రీ విష్ణువు అవతారంలోని మిగిలిన విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. వీటికి సంబంధించిన ఆచారాలు ఈరోజు (జూన్ 3వ తేదీ మంగళవారం) నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు.జూన్ 5న ఉదయం 6:30 గంటలకు రామ దర్బార్ ప్రతిష్ట కార్యక్రమానికి కర్మ ప్రారంభమవుతుంది. ఈ సమయంలో శ్రీ రాముని ప్రాణ ప్రతిష్ఠ ఉదయం 11:30 గంటలకు అభిజిత్ ముహూర్తంలో జరుగుతుంది. ఈ కార్యక్రమం జరిగే సమయంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉంటారు. మధ్యాహ్నం 1 గంట వరకు రామ దర్భర్ కు సంబంధించిన కార్యక్రమాలు జరగనున్నవి. సోమవారం ఉదయం జూన్ 2వ సరయు ఒడ్డున మాతృ శక్తి ద్వారా భక్తితో గొప్ప కలశ యాత్ర జరిగింది. ఈసారి ప్రాణ ప్రతిష్ఠ ముహూర్తాన్ని అయోధ్య పండితులు నిర్ణయించారు.

## ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం

✍ జయభేరి, ఆకివీడు:

ఆకివీడులో ఒకటో తరగతి చదువుతున్న 8 సంవత్సరాల బాలికను సమీపాన నివసిస్తున్న మాంసం వ్యాపారి షేక్ మీరా అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. బాలిక కడుపు నొప్పితో బాధపడుతూ ఉండడంతో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా విషయం బయటపడింది. బాలిక తల్లిదండ్రులు తిరపతి నుంచి ఇక్కడికి వచ్చి బడ్డీ కొట్టు నడుపుకుంటున్నారు. ఆకివీడు సంత మార్కెట్ ప్రాంతంలోని పడాల వారి వీధిలో నివసిస్తున్నారు. బాలికను ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికకు ఆకివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేస్తున్నారు. బంధువులు. ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆకివీడు ఎస్ఐ హనుమంత నాగరాజు సంఘటన స్థలానికి చేరి వివరాలు సేకరించారు.

# ఉపాధి హామీ కార్మికులు బకాయి వేతనాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్.

✍ జయభేరి, పరవాడ:




పరవాడ మండలంలో ఉపాధి హామీ కార్మికులకు 8 వారాలు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం గొర్లివానిపాలెం పని ప్రదేశంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి. సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు 8 వారాల నుండి వేతనాలు చెల్లించకపోవడం వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ ఎనిమిది వారాల వేతనాలు వెంటనే చెల్లించాలని గని శెట్టి డిమాండ్ చేశారు.ఉపాధి హామీ కార్మికులు అర్ధాకులతో జీవిస్తున్నారని 8 వారాల నుండి వేతనాలు బకాయి పెట్టడం అన్యాయం అన్నారు. ఉపాధి హామీ పని చేస్తున్న కార్మికులకు మంచినీరు మజ్జిగ నంటివి సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పారకి తట్టకి గుంపాంకి డబ్బులు చెల్లించాలని, వేసవి వేతనం కూడా కలిపి 40% అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, రోజుకి 600 రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొలతలతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రకటించిన జీవో ప్రకారంగా 309 రూపాయలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ కార్మికులందరికీ మండలంలో అన్ని గ్రామాల్లోనూ పని కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లైవ్ ఆడిట్ పేరుతో ఉపాధి హామీ కార్మికులను వేధింపులకు గురి చేసే విధానం మానుకోవాలని కార్మికుల రక్షణకు సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రతి వారం వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని గని శెట్టి ప్రభుత్వాలను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

✍ జయభేరి, గజ్వేల్ జూన్ 02 :




ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆసుపత్రి సిబ్బందికి గజ్వేల్ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలపై సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రులలో అనుకోకుండా అగ్ని ప్రమాదం జరిగితే ఆసుపత్రిలో ఉన్న ఫైర్ సేఫ్టీ ద్వారా పలు విధాలుగా ప్రమాదకటనను కొద్ది మేరకు తగ్గించుకునే అవకాశాలు ఉంటాయని అంతేకాకుండా మహిళలు ఇంట్లో వాడే గ్యాస్ లీకేజీ పై కూడా అవగాహన కల్పించారు రద్దీ ప్రాంతాలలో ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక శాఖ అధికారులు క్షతగాత్రులను చేసే చికిత్సలపై అవగాహన కల్పించారు పెట్రోల్ డీజిల్ ద్వారా ప్రమాదాలు జరిగితే వాటిపైన నీటితో చల్లార్చకుండా ఇసుకను వాడి చల్లార్చాలని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూప, సువర్ణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# వివేకానందనగర్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 3:



హైదరాబాద్ కూకట్‌పల్లిలోని వివేకానంద నగర్‌లో డ్రగ్స్ ముఠా గుట్టురట్టు అయింది. ఏపీ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలిస్తున్న ఆరుగురు సభ్యుల ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కోట్ల రూపాయల విలువైన 840గ్రాముల కొకైన్, ఎపిడ్రిన్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఐదు మొబైల్స్, 50 వేల నగదు సీజ్ చేశారు. ఇక.. నిందితుల్లో ఒకరు తిరుపతి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ ఉన్నట్లు గుర్తించారు. తిరుపతి కానిస్టేబుల్ గుణశేఖర్ తోపాటు మరో ఐదుగురిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ డ్రగ్స్ గ్యాంగ్ అరెస్ట్‌పై కీలక విషయాలు వెల్లడించారు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి. తిరుపతిలో ప్రారంభమైన డ్రగ్స్ ముఠా దందా.. బాపట్ల.. గుంటూరు నుంచి హైదరాబాద్ మీదుగా కొనసాగుతున్నట్లు తెలిపారు.అరెస్టయిన వారంతా ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారేనని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మహిళను కూడా అరెస్టు చేశారు. తిరుపతికి చెందిన కానిస్టేబుల్ గుణశేఖర్(40), తిరుపతి రూరల్ ప్రాంతానికి చెందిన నిరుద్యోగి ఉన్నం సురేంద్ర(31), బాపట్ల జిల్లా కర్ల పాలెం మండలానికి చెందిన కాంట్రాక్టర్ దొంతి రెడ్డి హరిబాబు రెడ్డి (38), అద్దంకి మండలానికి చెందిన ఫాస్ట్ ఫియాడ్ నిర్వాహకురాలు చెగుడు మెర్సీ మార్గరేట్(34), షేక్ మస్తాన్వలీ(40), దేవరాజు యేసుబాబు(29) కలిసి డ్రగ్స్ దందా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ కేసులో పోలీసు ఉద్యోగంలో ఉన్న వ్యక్తి పట్టుబడటం ప్రస్తుతం సంచలనంగా మారింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.



## భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

✍ జయభేరి, తుర్కపల్లి, జూన్ 3 :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండలం గోపాలపురం, నాగాయపల్లి గ్రామాల్లో భూ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గోపాలపురం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈ అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఉన్న రైతులు ఈ సదస్సులో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు .ఎన్నో సంవత్సరాల నుండి భూ సమస్యలు కోసం ఇబ్బంది పడుతున్న రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దేశ నాయక్, డిప్యూటీ తహసిల్దార్ కల్పన, ఆర్ఐలు జహంగీర్, రఘు రామారావు, సీనియర్ అసిస్టెంట్ సాలెం, ఎంపీఎస్ఓ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్లు పుండరీకం, రమేష్, కరుణాకర్, స్వరూప, సర్వే శ్రీనివాస్, రికార్డ్ అసిస్టెంట్లు చరణ్ సింగ్, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.

## లయన్ క్లబ్ డాక్టర్ చెన్న కిష్టయ్యను సన్మానించిన లయన్ క్లబ్ గవర్నర్



✍ జయభేరి, తుర్కపల్లి, జూన్ 3 :

తుర్కపల్లి మండల కేంద్రంలో లయన్ క్లబ్ డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య , మీర్పేట్ ఎమ్మెస్ రెడ్డి లయన్ క్లబ్ ఐ హాస్పిటల్ అడ్వైజర్ గుడి గంటల రాములు లు చేస్తున్న సేవలను గుర్తించి 320 సి జిల్లా లైన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ వి కృష్ణ ప్రసాద్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

## టీబీ వ్యాధిని నిర్మూలించాలి



✍ జయభేరి, తుర్కపల్లి, జూన్ 3 :

టీబీ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డిఎంహెచ్వో మనోహర్ అన్నారు. మంగళవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయముక్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధి నిర్మూలన కోసం మొబైల్ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగ అనుమానితుల కేసులను గుర్తించుటకు జ్వరము, దగ్గు, జలుబు, ఆకలి మందగించడంతోపాటు, తెమడలో రక్తం పడుతూ బలహీనంగా ఉంటూ, బరువు తగ్గిన వారిని పిలిచి అవసరమైన పరీక్షలు, ఎక్స్రేలు తీసి వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స చేయడం వల్ల టీబీ వ్యాధిని నిర్మూలించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య అధికారి సాయి శోభ, పిహెచ్సి డాక్టర్ రుచిరా రెడ్డి, డాక్టర్ శ్రీవాత్సవ్, డాక్టర్ రాహుల్ కుమార్ గౌడ్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టిపిసి, సిఎస్ఆర్ నిధులతో సోలార్ విద్యుత్ వెలుగులు

- హర్షం వ్యక్తం చేసిన సర్పంచ్ చింతకాయల



✍ జయభేరి, పరవాడ:

పరవాడ మండలం ముత్యాలమ్మ పాలెం మత్స్యకార గ్రామాలలో, సమ్మంగిపాలెం, జాలారిపేట, ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం సుమారుగా 10,000 మంది జీవిస్తూ చేపల వేట వృత్తిగా జీవిస్తున్నారు, మత్స్యకారులు ప్రతిరోజు అర్ధరాత్రి రెండు గంటల నుండి తన జీవన ఆధారంగా చేపల వేటకు వెళ్తూ ఉంటారు, చీకటిగా ఉండటం వల్ల చాలా ఇబ్బందులు పడేవారు, ఎన్ టిపిసి, సిఎస్ఆర్ నిధులతో 40 సోలార్ విద్యుత్ లైట్లు మంజూరు చేశారు. మత్స్యకార గ్రామాలలో మరెన్నో వెలుగులు నింపాలని, గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు మరియు ఎంపీటీసీలు అర్జిల్లి రవిదేవి, మైలపల్లి అప్పన్న, ఎన్టిపిసి సిఎస్ఆర్ అధికారులకు కోరారు. సోలార్ లైట్లు మంజూరు చేసిన ఎన్టిపిసి అధికారులకు గ్రామ ప్రజలు మరియు గ్రామ సర్పంచ్, ఎంపిటిసిలు సంతోషం వ్యక్తం చేశారు.

## కడియం శ్రీహరిని అడ్డుకున్న మహిళ

జనగామ:

ఇందిరమ్మ ఇండ్ల పంపిణి కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి నిరసన సెగ తగిలింది. అయితే నిరసన తెలిపిన మహిళను పోలీసులు ఈడ్చుకెళ్లారు. జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం శివునిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పంపిణి కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మహిళలు అడ్డుకున్నారు. నిరుపేదలయిన తమకు కాకుండా లక్షలకు లక్షలు ఆస్తులున్న వారికే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారంటు శివునిపల్లి గ్రామానికి చెందిన పుంజూరి రజిత నాగరాజు దంపతులు ఫ్లెక్సీతో నిరసనకు దిగారు. తమకు ఇల్లు ఇవ్వాలని ఎమ్మెల్యేను దండం పెట్టి వేడుకున్నారు. వారిని పోలీసులు అడ్డుకుని ఫ్లెక్సీని లాగేసుకుని బాధితులను ఈడ్చుకెళ్లారు.



## నిరుపేద మహిళా పెండ్లికి పూస్తే మట్టెలు అందజేతా..

✍ జయభేరి, వర్గల్, జూన్ 03 :

నిరుపేద మహిళకు పెండ్లికి పూస్తే మట్టెలు అందజేసి శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుండుకాడి వెంకటేష్ గౌడ్ అండగా నిలిచారు. వర్గల్ మండలం సీతారాం పల్లి గ్రామానికి చెందిన తుపాకుల నవనీత కూతురు కావ్య వివాహానికి పూస్తే మట్టెలు అందజేసి ఆర్థికగా తోడున్నారు. ఎందరో ఆడ బిడ్డలకు పూస్తే మట్టెలు సహాయం చేస్తూ తన మానవత్వనీ చాటుకున్నారు.దయానియ స్థితిలో ఉన్న ఆ పేద కుటుంబాని అదుకోవడానికి చిరు సహాయం అందించామన్నారు. వీలైనంత వరకు సహాయం చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంజాల నరసింహ గౌడ్, భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపిన శాసనసభ్యులు బాలు నాయక్



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ నియోజకవర్గానికి 200కోట్ల రూపాయల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు చేసిన సందర్భంగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్.

## త్రాగు నీటి సమస్య తీర్చిన జాలే నరసింహారెడ్డి



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండలంలోని ముదిగొండ ఉమ్మడి గ్రామ పంచాయతీ అయిన అచ్చమ్మకుంటతండ గ్రామ ప్రజలు మాకు త్రాగునీటి సమస్య ఉందని జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు PACS చైర్మన్ ని సంప్రదించగా వెంటనే మానవత దృక్పథంతో మంచి మనసుతో స్పందించిన నరసింహారెడ్డి మంచినీటి బోరు , వాటికి సంబంధించిన పైపులు ఇతర సామాన్లు వారికి అందజేయడం జరిగింది. అనంతరం అచ్చమ్మకుంటతండ గ్రామ ప్రజలు నరసింహారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేనావత్ రవినాయక్, నేనావత్ శ్రీధర్, నేనావత్ రాథోడ్, నేనావత్ నగేష్, నేనావత్ మహేష్, నేనావత్ సాయి శంకర్, నేనావత్ ఉదయ్ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ దొరకగా డిపో అధికారులకు అందజేసింది



✍ జయభేరి, దేవరకొండ :

దేవరకొండ బస్ స్టేషన్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్లకు చెందిన సుబ్బారావు రూ.30 వేల విలువైన మొబైల్ ను పోగొట్టుకున్నాడు. ఆర్టీసీ బస్ స్టేషన్ లో స్వీపర్ గా పనిచేస్తున్న ముత్తమ్మకు దొరకగా డిపో అధికారులకు అందజేసింది. అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు విచారణ జరిపి మంగళవారం బాధితునికి డిపో కార్యాలయంలో మొబైల్ అందజేశారు. నిజాయితీ చాటుకున్న స్వీపర్ కు ఆర్టీసీ అధికారులు అభినందనలు తెలిపారు. ఆర్టీసీ అధికారులకు, స్వీపర్ కు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



✍ జయభేరి, ములుగు, జూన్ 02 :

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ములుగు మండలం కొత్తూరు లో సోమవారం జాతీయ జెండాను కాంగ్రెస్ సీనియర్ నాయకులు పరుపుని అశోక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఉద్యమ ఆకాంక్ష గుర్తించి పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నష్టం జరుగుతుందని తెలిసి ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీకి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాల మల్లేష్, కొటురీ మల్లేష్, వడ్ల శ్రీను, చెట్టి వెంకటేష్, కొటురీ నరేశ్, గుడెపు నరసింహా, కుమ్మరి పెంటయ్య, ఎర్ర వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మారుతున్న విద్యావిధానం

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 3:




పాఠ్యపుస్తకంలో ఉన్నది ఉన్నట్లుగా బోధించే మూస పద్ధతి బోధనకు ఉపాధ్యాయులు స్వస్తి పలుకనున్నారు. వినూత్న పద్ధతుల్లో ఇకనుంచి విద్యార్థులకు బోధించనున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి బోధనా పద్ధతుల్లో విద్యా శాఖ మార్పులు తీసుకురానుంది. అందుకు ఉపాధ్యాయులను సంసిద్ధం చేసింది. గతంలో కంటే పూర్తి భిన్నంగా తరగతి గదుల్లో విద్యార్థులకు బోధించే లా ఇటీవల టీచర్లకు ఉన్నతాధికారులు శిక్షణ ఇచ్చారు.పుస్తకంలోని పాఠాన్ని ఏదో మొక్కుబడిగా చెప్పేశామని కాకుండా ఉపాధ్యాయులు సరికొత్త పద్ధతులను అమలుచేయాలని ఆదేశించారు. వీలైతే ఆటాపా టలతో బోధించాలని సూచించారు. పిల్లవాడిని ఆకర్షించేలా, సులువుగా అర్థమయ్యేలా బోధనా పద్ధతులను అవలంబించాలని పేర్కొన్నారు. ఆక్టివిటీస్ బేస్‌గా విద్యాబోధన ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమవ్వడమే కాకుండా ఎక్కువ కాలం గుర్తుండి పోతుంది.ఇందుకు టీచర్ పాఠాలు చెప్పేటప్పుడు విద్యార్థులను ఇన్‌వాల్వ్ చేయాలని అధికారులు సూచించారు. కేవలం బ్లాక్‌బోర్డుపై సుద్దముక్కతో పాఠాలు చెప్పకుండా అవసరమైన చోట బోధనోపకరణాలను ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధనా పద్ధతులను అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా పద్ధతులు, ఎన్‌రోల్‌మెంట్‌పై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. విడతల వారీగా ఉపాధ్యాయులు, ఎంఈవోలకు శిక్షణ ఇస్తోంది. ఇప్పటికే ఉపాధ్యా యుల శిక్షణ పూర్తి కాగా, ప్రస్తుతం ఎంఈవోల శిక్షణ కొనసాగుతోంది. త్వరలో ప్రతీజిల్లా నుంచి బెస్ట్ ప్రాక్టీసెస్ టీచర్లను ముగ్గు రి చొప్పున ఎంపిక చేసి సదస్సును నిర్వహించనున్నారు.

**ప్రభుత్వ బడుల్లో తగ్గుతున్న ఎన్‌రోల్‌మెంట్..**

ఒకవైపు తల్లిదండ్రులకు ప్రభుత్వ బడులపై నమ్మకం సన్నగిల్లడం, మరోవైపు ప్రైవేట్ బడులు ఆకర్షిస్తుండటంతో సర్కారు బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ ప్రతిఏటా పడిపోతోంది. చదువుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు ఖర్చుచేస్తున్నా ఎన్‌రోల్‌మెంట్ పడిపోతుండటంతో ప్రభు త్వ స్కూళ్ల మనుగడ ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో 42,900బడులుంటే అందులో 30,022 (70 శాతం) ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిలో ఎన్‌రోల్‌మెంట్ కేవలం 27.8లక్షలు (38.11 శాతం విద్యార్థులు) మాత్రమే ఉన్నారు.

ఇక ప్రైవేట్ స్కూళ్లు 12,125 (28.26 శాతం) ఉండగా, వీటిలో మాత్రం 44.31లక్షలు (60.75 శాతం) మంది విద్యార్థులున్నారు. గత ఆరేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య క్రమంగా తగ్గుతుంటే..ప్రైవేట్ స్కూళ్ల లో పెరుగుతోంది. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు కోత పడుతోంది. సమగ్రశిక్ష ప్రాజెక్టు కింద రాష్ట్రాలకు కేంద్రం నిధులిస్తోంది.

అయితే వీటిని సకాలంలో వివిధ కార్యక్రమాలకు ఖర్చుచేయాల్సి ఉం టుంది. వాటిని ఖర్చు చేయకుంటే నిధుల్లో కేంద్రం కోత విధిస్తుంది.2025 విద్యాసంవత్సరం నుంచి ప్రత్యే క కార్యాచరణ తీసుకున్న విద్యాశాఖ అటు ప్రభుత్వ బడుల్లో ఎన్‌రోల్‌మెంట్ పెంచేందుకు, వినూత్న పద్ధతుల్లో బోధించేందుకు ప్రణాళికలు రచించింది. జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఉపాధ్యాయులు, అధికారులు, అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇందులో పాల్గొని బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించనున్నారు.ప్రతీ బడిలో ఎన్‌రోల్‌మెంట్ సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు, ఎంఈవోలు కృషిచేయాలని ఆదేశించారు.

అంతేకాకుండా ఈ విద్యాసంవత్సరం నుంచి జిల్లాకు 30 చొప్పున ప్రీప్రైమరీ తరగతులు సైతం ప్రారంభించాలని విద్యాశాఖ ఇప్పటికే భావించింది. అయితే వీటికి సంబంధించిన ఉత్వర్వులు జారీ కావాల్సి ఉంది.

# పేద కుటుంబాలు అప్పుల పాలు కావడానికి ఒక ప్రధానమైన కారణం వైద్యం

■ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్

✍ జయభేరి, హైదరాబాద్ జూన్ 3:



పేద కుటుంబాలు అప్పుల పాలు కావడానికి ఒక ప్రధానమైన కారణం వైద్యం అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కుషాయిగూడ, అల్వాల్ పి.హెచ్.సి లకు క్యాన్సర్ పరీక్షాపరికరాలు మహతి ఫౌండేషన్ సహకారంతో అందించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తో కలిసి ముఖ్య అతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ కొంతమంది తాగి ఆరోగ్య ని చెడగొట్టుకోవచ్చు కానీ నాకు ఆరోగ్య శాఖతో చాలా అనుబంధం ఉంది. దీంట్లో ఎన్ని బాధలు ఉంటాయో నేను కళ్ళారా చూశాను.

ఈ శాఖ ఎంత బలపడితే, ఎంత గొప్పగా పని చేస్తే ప్రజలకి పేదరికం నుండి బయటపడే ఆస్కారం ఉంటుందన్నారు.. వైద్యానికి అయ్యే వచ్చే ఖర్చు అనుకోకుండా వచ్చే ఖర్చు. తల్లి ప్రేమకు ధనిక, పేద తేడా ఉండదు. ఎంత టెక్నాలజీ పెరిగిన క్యాన్సర్ మరణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి.నవరత్నాలలో మీ కంపెనీ ఉన్నందుకు గర్వపడుతున్నాను. ప్రజలకోసం ముందుకు వచ్చి డబ్బులు ఇస్తున్నందుకు సంతోషం.గరీబోళ్ల అడ్డా అంటే మల్కాజ్గిరి. ఎవరు పొట్ట చేత పట్టుకొని వచ్చిన మొదట ఉండేది మల్కాజ్గిరి లోనే. అందుకే దీన్ని మినీ ఇండియా అంటారు. హైదరాబాద్ అనగానే హైటెక్ సిటీ చూసి మనం మురిసిపోకూడదు,దాని పక్కనే దుఃఖాలతో నిండిన బస్తీలు ఉంటాయి. వాళ్లకి మనం అండగా ఉండాలి. కొంతమంది తాగి ఆరోగ్య ని చెడగొట్టుకోవచ్చు కానీ పేద కుటుంబాలు అప్పుల పాలు కావడానికి ఒక ప్రధానమైన కారణం వైద్యం. ఈ జిల్లా మొత్తంలో ఏ హాస్పిటల్లో ఏ సౌకర్యాలు కావాలో నాకు ఇవ్వండి తప్పకుండా మీకు ఇప్పించే ప్రయత్నం చేస్తాను. కొత్తగా మంత్రి అయిన నాడు MNJ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్లో , NIMS లో పెట్ స్కాన్ లేదు. నేను 25 కోట్లతో రెండు పెట్ స్కాన్లు తీసుకొచ్చి పెట్టాను. మీలాంటి ఒక సంస్థను రిక్వెస్ట్ చేసి 17 కోట్లతో కేంద్ర సెంటర్ ను ఏర్పాటు చేశాము. వైద్యం నారాయణనో హరి. డాక్టర్ల జీతాలు ఏంటి, మీ సమస్యలు ఏంటి, మీ కష్టాలు ఏంటో నాకు తెలుసు. డాక్టర్లకు జీతాలు అతితక్కువ ఉంటున్నాయి. డాక్టర్స్ కి కడుపునిండా జీతం ఇచ్చి పని చేయించుకోండి. ఎన్నో వేల కోట్లు దేనికో ఖర్చు పెడుతున్నాము కానీ ఈ శాఖకు ఖర్చు పెడితే ఫ్రూటిఫుల్ ఎక్స్పెండిచర్ అని చెప్పాను. ఆశావర్కర్లకి జీతాలు సరిగాలేవు. మీకు కూడా మంచి రోజులు వస్తాయి.నాకు వేరే వ్యాపకం లేదు. సమస్యలు నా దృష్టికి తీసుకొని రండి వాటిని పరిష్కరించే ప్రయత్నం చేస్తానని, ఎంత పని చేసినా మీ ఋణం తీర్చుకోలేనిది అని ఈటల రాజేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి,IOCL CGM ARV బద్రీనాథ్, DMHO మేడ్చల్ మల్కాజ్గిరి Dr. C. ఉమా గౌరీ, నేషనల్ బయోడైవర్సిటీ అథారిటీ మెంబెర్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ రమేష్ శేఖర్ రెడ్డి, జిల్లా బీజేపీ జనరల్ సెక్రెటరీ మాణిక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మాజీ మంత్రి హరీష్ రావు జన్మదిన సందర్భంగా పండ్ల పంపిణీ


✍ జయభేరి, డిండి :

డిండి మండలం వావిల్ కోల్ (వడ్డెర గూడెం) బి ఆర్ ఎస్ అధ్యక్షులు ఓర్సు ముత్యాలు హైదరాబాదులో తాను నివాసం ఉండే ఏరియాలో మాజీ మంత్రివర్యులు హరీష్ రావు జన్మదిన సందర్భంగా హరీష్ రావు ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకొని బీద ప్రజలకు పాలు పండ్లు పంపిణీ చేసినారు.



# సికింద్రాబాద్ కు సమ్మర్ ట్రైన్స్

✍ జయభేరి, హైదరాబాద్, జూన్ 3:




వేసవి సెలవుల చివరి దశకు చేరాయి. ఈ నేపథ్యంలో స్వస్థలాలకు వెళ్లిన ప్రజలు తిరిగి నగరాలకు పయనమవుతుండటంతో రైల్వే స్టేషన్లలో రద్దీ గణనీయంగా పెరిగింది. ప్రయాణికుల అసౌకర్యాన్ని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకొని.. అనేక ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు అధికారులు ప్రకటించారు. జూన్‌లో 150 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. దక్షిణ మధ్య రైల్వే ప్రకటించిన వివరాల ప్రకారం.. దీనిలో సికింద్రాబాద్ కాకినాడ టౌన్ మధ్య మొత్తం 16 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. ఈ రైళ్లు రెండు నెలల పాటు నడపబడతాయి.సికింద్రాబాద్ నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07041) ప్రతి గురువారం రాత్రి 10:40 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు శుక్రవారం ఉదయం 10:45 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 12, జూన్ 19, జూన్ 26వ తేదీల్లో నడుస్తుంది. మళ్లీ జులై నెలలో.. జులై 3, జులై 10, జులై 17, జులై 24, జులై 30 తేదీలలో సేవలు అందిస్తుంది.కాకినాడ టౌన్ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లే ప్రత్యేక రైలు ప్రతి శుక్రవారం ఉదయం 6:55 గంటలకు బయలుదేరి.. శనివారం ఉదయం 07:00గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 13 నుంచి ప్రతీ శుక్రవారం బయలుదేరుతుంది. ఆగస్టు 1న చివరి ట్రిప్ వేయనుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్లగొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లె, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట వంటి ప్రధాన స్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ఫస్ట్ AC, సెకండ్ AC, థర్డ్ AC కోచ్‌లతో పాటు ఇతర తరగతుల బోగీలు కూడా అందుబాటులో ఉంటాయిప్రస్తుతం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. చాలా వరకు ట్రైన్లను చర్లపల్లి టెర్మినల్‌కు మార్చారు.

**చర్లపల్లి స్టేషన్ నుంచి మరికొన్ని ట్రైన్స్..**

హైదరాబాద్ నగరానికి నాలుగవ అతి పెద్ద రైల్వే టెర్మినల్‌గా చర్లపల్లి అభివృద్ధి చేయబడింది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్లలో రద్దీని తగ్గించడానికి, చర్లపల్లి నుంచి రైళ్లు నడపడం ప్రయాణికులకు, ముఖ్యంగా నగర తూర్పు ప్రాంత ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఇక్కడ నుంచి కూడా ప్రత్యేక ట్రైన్స్ జన్ 6వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నాయి. విశాఖపట్నం టు చర్లపల్లి మార్గంలో ఎనిమిది రైళ్లు జూన్ 6 (శుక్రవారం) నుండి జూలై 25 వరకు సేవలందిస్తాయి. చర్లపల్లి టు విశాఖపట్నం రైలు తిరుగు ప్రయాణంలో ఎనిమిది రైళ్లు జూన్ 7 నుండి జూలై 26 వరకు అందుబాటులో ఉండనున్నాయి.విశాఖచర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు.. రైల్వే ప్రచారం లేక ఖాళీగానే ప్రయాణంఈ ప్రత్యేక రైళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కామారెడ్డి సహా పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయి. ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలకు అనుగుణంగా ఈ రైళ్లను ఉపయోగించుకుని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని రైల్వే అధికారులు సూచించారు.

## ఓబిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడి గా NVT ఎన్నిక



✍ జయభేరి, దేవరకొండ :

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓ బి సివెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా NVT ఎన్నిక కావడం జరిగినది. ఈ సందర్భంగా అధ్యక్షుడు NVT మాట్లాడుతూ ఓబీసీ బ్యాంకు ఉద్యోగుల హక్కులకై వారి సమస్యలు ఏదున్న పరిష్కరిస్తానని ఈ సందర్భంగా వారన్నారు.

05

జయభేరి సినిమా

04-06-2025

బుధవారం

jayabheridaily.com



# లెజెండ్స్ మళ్లీ కలిస్తే..?

దక్షిణాది లెజెండ్స్ రజనీకాంత్, కమల్‌హాసన్ మళ్లీ కలిసి నటిస్తే చూడాలన్నది అభిమానుల ఆకాంక్ష. వీరిద్దరు కెరీర్ ఆరంభంలో 20కిపైగా చిత్రాల్లో నటించారు. వాటిలో మెజారిటీ సినిమాలు సూపర్‌హిట్స్. అయితే ఇద్దరు హీరోలు వ్యక్తిగతంగా స్టార్‌డమ్ సంపాదించుకున్న తర్వాత కలిసి నటించలేదు. 'దళపతి' సినిమాలో కమల్‌హాసన్‌ను తీసుకోవాలనుకున్నారు దర్శకుడు మణిరత్నం. కానీ కుదరలేదు. ఆ స్థానంలో మమ్ముట్టి నటించారు. ఇప్పుడు దర్శకుడు లోకేష్ కనకరాజ్ ఈ ఇద్దరు సూపర్‌స్టార్స్ కోసం అద్భుతమైన కథను సిద్ధం చేశారట. వయసు మళ్లిన ఇద్దరు గ్యాంగ్‌స్టర్స్ రిటైర్ అయిన తర్వాత ఏం చేశారు? వారి లైఫ్ ఏమిటన్నదే ఈ సినిమా కాన్సెప్ట్ అని తెలిసింది. అయితే ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కడానికి అన్నీ అనుకూలించాలంటున్నారు. ఎందుకంటే ప్రస్తుతం రజనీకాంత్‌తో 'కూలీ' సినిమా చేస్తున్నారు దర్శకుడు లోకేష్ కనకరాజ్. ఇది పూర్తయిన తర్వాత 'ఖైదీ' 'విక్రమ్' సినిమాలకు సీక్వెల్స్ చేయాల్సి ఉంది.

ఈ ప్రాజెక్ట్స్ అన్నీ పూర్తవడానికి నాలుగేళ్లకు పైగా పట్టొచ్చు. ఆలోగా పరిస్థితులు ఎలాగుంటాయో చెప్పలేం. అయితే తన ఆరాధ్య నటులు రజనీకమల్‌హాసన్ కాంబోలో సినిమా చేయాలన్నది లోకేష్ కనకరాజ్ లైఫ్‌టైమ్ డ్రీమ్ అట. దానిని ఎప్పటికైనా నెరవేర్చుకుంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు లోకేష్ కనకరాజ్. అభిమానులు కూడా ఈ ఇద్దరు లెజెండ్స్‌ను వెండితెరపై చూడాలని ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

# సమంతతో త్రివిక్రమ్ లేడీ ఓరియెంటెడ్ మూవీ?



త్రివిక్రమ్ దర్శకత్వంలో అత్తారింటికి దారేది, సన్నాఫ్ సత్యమూర్తి, అఆ.. చిత్రాల్లో కథానాయికగా నటించారు సమంత. ఈ మూడూ బ్లాక్‌బస్టర్సే. అయితే.. 'అఆ' తర్వాత త్రివిక్రమ్ డైరెక్షన్‌లో సమంత నటించలేదు. తాజా సమాచారం ప్రకారం మళ్లీ వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా రానున్నదని తెలుస్తున్నది. ఇటీవల ఓ సందర్భంలో సమంత తెలుగు సినిమాల్లో నటించాలని త్రివిక్రమ్ కోరారు. సామ్ కూడా తన 'శుభం' ప్రమోషన్‌లో భాగంగా తెలుగు సినిమాల్లో నటించాలనుందనీ, అయితే.. సరైన కథలు రావడం లేదని, మంచి లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ వస్తే చేస్తానని చెప్పుకొచ్చింది. అందుకే.. సామ్ కోసం గురూజీ మళ్లీ కలం పట్టారట. ప్రస్తుతం ఆయన వెంకటేశ్‌తో సినిమా చేయబోతున్న విషయం తెలిసిందే. వెంకటేష్ కాల్షీట్లు ఖరారైతే.. ఈ సినిమా పట్టాలెక్కుతుంది. అయితే.. ఈ లోపు సామ్ కోసం గురూజీ ఓ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌ను తయారు చేసే పనిలో ఉన్నారట. 600కోట్ల నిర్మాణ వ్యయంతో అట్లీ తెరకెక్కిస్తున్న బన్నీ ప్రాజెక్ట్ పూర్తవ్వడానికి చాలా సమయం పడుతుంది. ఈ గ్యాప్‌లో.. వెంకీ సినిమాతోపాటు సమంత సినిమాను కూడా పూర్తి చేసేయాలని త్రివిక్రమ్ భావిస్తున్నారని ఫిల్మ్ వర్గాల సమాచారం.



# రిలీజ్ ఆపేసి ఓటీటీలోకి భారీ చిత్రం!

బాలీవుడ్‌లో ఓ చిత్ర మరో రోజులో థియేటర్లలో విడుదల కావాల్సి ఉండగా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇప్పుడీ విషయం దేశవ్యాప్తంగా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. స్త్రీ, స్త్రీ2, ముంజ్యా, ఛావా అంటూ భారీ బ్లాక్‌బస్టర్ చిత్రాలతో బాలీవుడ్‌ను షేక్ చేస్తోన్న నిర్మాణ సంస్థ మాడొక్ ఫిలింస్. తాజాగా ఈ సంస్థ నుంచి రాజ్ కుమార్ రావు, వామికా గబ్బి హీరోయిన్‌గా హిందీలో రూపొందిన చిత్రం భూల్ చుక్ మాఫ్. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా థియేటర్లలో విడుదలకు రెడీ అయింది. ఫుల్ లెంగ్త్ కామెడీ లవ్, ఫ్యామిలీ, జానర్‌లో వస్తోన్న ఈ మూవీ టీజర్, ట్రైలర్, పాటలు ఇప్పటికే రిలీజై ఓ ఊపు ఊపాయి. తీరా తెల్లారితే థియేటర్లలోకి సినిమా వస్తుందనుకుంటున్న సమయంలో ఉన్నట్టుండి మేకర్స్ సోషల్‌మీడియా వేదికగా ఓ ప్రకటన విడుదల చేసి సినిమాను థియేటర్లలో విడుదల చేయడం లేదంటూ ప్రకటించి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం భారత్, పాకిస్తాన్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో ప్రజల క్షేమం కాంక్షించి మా మూవీని థియేటర్లకు తీసుకు రాలేకపోతున్నాం మే 16న డైరెక్ట్ అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీలో విడుదల చేస్తున్నాం క్షమించండి అంటూ పోస్టు పెట్టారు. మాడొక్ ఫిలింస్ ఉన్నఫలంగా తీసుకున్న ఈనిర్ణయంతో చాలా సినిమాల మేకర్స్ ఇప్పుడు తమ తమ సినిమాల విషయంలో సందిగ్ధంలో పడ్డారు.



# కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్..

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం విశ్వంభర సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. చిరంజీవి చివరిగా నటించిన భోళాశంకర్ సినిమా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. మెహెరమేష్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా డిజాస్టర్ అవ్వడంతో ఇప్పుడు అభిమానులంతా విశ్వంభర సినిమా గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఇందులో త్రిష కథానాయికగా నటిస్తుండగా.. మరో హీరోయిన్ ఆషికా రంగనాథ్ సైతం కనిపించనుందని అంటున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ ఆకట్టుకుంటున్నాయి. ఇటీవలే శ్రీ రామనవమి రోజున ఓ సాంగ్ కూడా రిలీజ్ చేశారు. అయితే ఇప్పుడు చిరు కొత్త సినిమా గురించి ఓ క్రేజీ న్యూస్ చక్కర్లు కొడుతుంది. ఈ సినిమాకు వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే కళ్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కిన బింబిసార సినిమాతో వశిష్ట మంచి విజయాన్ని అందుకున్నాడు. ఇక ఇప్పుడు మరోసారి సోషియో ఫాంటసీ కథతో చిరంజీవి సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా కోసం మెగా అభిమానులంతా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. కాగా ఈ సినిమాలో చాలా మంది హీరోయిన్స్ కనిపించనున్నారని తెలుస్తుంది. అలాగే ఓ అందాల భామ మెగాస్టార్ చిరంజీవి సినిమాతో రీ ఎంట్రీ ఇవ్వనుంది. చేసింది కొన్ని సినిమాలే అయినా తన అందంతో నటనతో ఆకట్టుకుంది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? మెగాస్టార్ చిరంజీవి సినిమాతో రీ ఎంట్రీ ఇస్తున్న బ్యూటీ ఎవరో కాదు ప్రేమకావాలి సినిమాతో పరిచయమైన ఇషా చావ్లా. ఆదిసాయి కుమార్ హీరోగా నటించిన ప్రేమకావాలి సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది అందాల భామ ఇషా చావ్లా. తొలి సినిమాతోనే ఈ చిన్నది మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. అయితే ఈ అమ్మడికి ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. దాంతో తక్కువ సమయంలోనే ఇండస్ట్రీలో కనుమరుగైంది. చాలా కాలం పాటు సినిమాలకు బ్రేక్ తీసుకున్న ఈ అమ్మడు ఇప్పుడు మళ్లీ రీఎంట్రీ ఇస్తుంది.

# బాబోయ్ రష్మిక మరీ ఇంత బోల్డ్ షోనా..





ఛలో సినిమాతో తెలుగు ప్రేక్షకులకి దగ్గరైన రష్మిక మందాన ఆ తర్వాత వైవిధ్యమైన సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఈ అమ్మడు చేసిన యానిమల్, పుష్ప 2, ఛావా లాంటి సినిమాలు ఎంత పెద్ద విజయాలు అందించాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ మూడు సినిమాలతో అమ్మడు బాక్సాఫీస్ క్వీన్ అయిపోయారు రష్మిక మందాన. ఇప్పుడు టాలీవుడ్‌లోనే కాక బాలీవుడ్‌లోను రష్మిక క్రేజ్ పీక్స్‌కి చేరింది. ఈ మధ్య సల్మాన్ హీరోగా మురుగదాస్ తెరకెక్కించిన సికిందర్ సినిమాతో ప్లేక్షకులని పలకరించిన ఈ ముద్దుగుమ్మకి నిరాశే ఎదురైంది. చిత్రం బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది.

వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న రష్మికకి సికిందర్ రూపంలో బ్రేక్ పడింది. అయితే ప్రస్తుతం ఆయుష్మాన్ ఖురానాతో తమా సినిమా చేస్తున్నారు ఈ బ్యూటీ. ఇది మినహా మరే సినిమాకు సైన్ చేసినట్టు కనిపించడం లేదు. తెలుగులో ఎప్పుడో ఓకే చేసిన గాళ్‌ఫ్రెండ్, రెయిన్‌బో సినిమాలతోనే సరిపెట్టుకున్నారు. ఈమె తీరు చూస్తుంటే కొన్నాళ్లు సినిమాలకు బ్రేక్ ఇచ్చేలా కనిపిస్తున్నారంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా రష్మిక, విజయ్ దేవరకొండ పీకల్లోతు ప్రేమలో మునిగితేలుతున్నారని, త్వరలోనే వారిద్దరి వివాహం జరగనుందని కొందరు జోస్యాలు కూడా చెబుతున్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక గురించి మాట్లాడిన విజయ్ దేవరకొండ.. ఆమె చాలా మంచి వ్యక్తి. ఇంకా ఎన్నో మూవీస్‌లో తనతో యాక్ట్ చేయాలని ఉంది అని అన్నారు. మరి జీవిత భాగస్వామికి కావాల్సిన లక్షణాలు రష్మికలో ఉన్నాయా అనే ప్రశ్న ఎదురు కాగా, మంచి మనసు ఉన్న అమ్మాయి ఎవరైనా పర్వాలేదు అని సమాధానం చెప్పారు. మరి విజయ్ దేవరకొండ చెప్పిన సమాధానం బట్టి చూస్తుంటే తమ ప్రేమ గురించి క్లూ ఇచ్చారని, అఫీషియల్‌గా ప్రకటించడమే తరువాయి అని అంటున్నారు. ఇక ఇదిలా ఉంటే రీసెంట్‌గా జీ సినిమా అవార్డ్స్ ఈవెంట్‌కి హాజరైంది రష్మిక. బ్లాక్ డ్రెస్‌లో బోల్డ్‌గా కనిపిస్తూ అక్కడ ఉన్నవారితో సందడి చేసింది. ఫోటోగ్రాఫర్స్‌తో ఫొటోలకి పోజులిచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com